క్లుప్తంగా

నేటి నుంచి బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ

పుంగనూరు: పుంగనూరు మున్సిపాలిటీలో శనివారం నుంచి బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. 31 వార్డులలోను 15 రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, పార్టీ నాయకులు, అనుబంధ సంస్థల ప్రతినిదులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

చౌడేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు


విశేషాలంకారంలో చౌడేశ్వరీదేవి

సదుం: మండలంలోని జాంద్రపేటలో శుక్రవారం రామలింగ చౌడేశ్వరిదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. విశేష అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారాలు


నగదు పురస్కారాలు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

రొంపిచెర్ల: రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులు తౌఫిక్, అజీమ్, సమీవుల్లాకు పూర్వ విద్యార్థులు నగదు పురస్కారాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి మండలంలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు తన తల్లి జ్ఞాపకార్థం రూ.5116 ఇస్తానని పూర్వ విద్యార్థి మునిరాజ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ధనలక్ష్మి, పూర్వ విద్యార్థులు సూర్యప్రకాష్, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీలకు వైఎస్సార్‌సీపీ అండ


నాగరాజును సత్కరిస్తున్న నాయకులు

పలమనేరు: రాష్ట్రంలోని ఎస్టీలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాగరాజు తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎస్టీల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తామని తెలిపారు. ఇందులో పట్టణ అధ్యక్షులు హేమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం


ఫ్రీ బస్సు సేవలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

పలమనేరు: ఎమ్మెల్యే అమరనాథరెడ్డి శుక్రవారం పలమనేరు ఆర్టీసీ బస్టాండులో స్త్రీశక్తి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించారు. మహిళలకు జీరో టికెట్లు అందజేశారు. అనంతరం స్థానిక సీఎల్ఆర్సీలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాంట్రాక్టర్లు మాట్లాడుతూ గతంలో చేసిన పనులకు ఇప్పటి వరకు బిల్లులు అందలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

నేడు ఆడి కృత్తిక

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరులోని చెంగల్రాయ కొండపై ఉన్న సుబ్రమణ్య స్వామి ఆలయంలో శనివారం ఆడికృత్తిక ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్టు అర్చకులు తెలిపారు. ఉదయం స్వామికి అభిషేకాలు, రాత్రి వరకు స్వామి దర్శన సేవలు ఉంటాయన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

మువ్వన్నెల జెండా రెపరెపలు

పలమనేరు, పుంగనూరు, కుప్పం నియోజకవర్గాల్లో శుక్రవారం స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు, పోలీసు స్టేషన్లలో ఆయా అధికారులు జాతీయ జెండాలు ఎగురవేసి వందనం సమర్పించారు. దేశ స్వాతంత్య్రం కోసం నాయకులు చేసిన త్యాగాలు, కృషిని కొనియాడారు. వారి అడుగు జాడల్లో నడిచి దేశ అభివృద్ధి కోసం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. పాఠశాలల్లో పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు. –సాక్షి నెట్‌వర్క్


కుప్పం: జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్సీ భరత్


బైరెడ్డిపల్లె: ఆకట్టుకున్న భారతదేశం ముగ్గు



కుప్పం: కడా కార్యాలయం వద్ద స్వాతంత్య్ర దినోత్సవం, బైరెడ్డిపల్లె: జెండా ఎగురవేస్తున్న ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప


పుంగనూరు మండల కార్యాలయం...


సదుం సీహెచ్‌సీ సిబ్బందికి ప్రశంసా పత్రాల పంపిణీ

• పులిచెర్ల (కల్లూరు): పులిచెర్ల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, ఎంపీడీవో రాజశేఖరబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, వెంకటదాసరపల్లెలో ఎంపీటీసీ పోకల చంద్ర, సర్పంచ్ లక్ష్మి, కల్లూరు పోలీసు స్టేషన్‌లో సీఐ జయరామయ్య, ఎస్ఐ వెంకటేశ్వర్లు, మంగళంపేటలో ముర్వత్‌బాషా సర్పంచ్ ప్రతాప్ రెడ్డి తదితరులు జెండా ఎగురవేశారు.

• బైరెడ్డిపల్లె: స్థానిక ఎంపీడీవో కార్యాలయం, ఇండియన్ ఆటో స్టాండ్ వద్ద ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ ప్రసన్న కుమార్, ఎమ్మార్సీలో ఎంఈవో సుబ్రమణ్యం, పోలీసు స్టేషన్ ఆవరణలో ఎస్ఐ పరుశురాముడు జెండాలు ఎగుర వేసి గౌరవ వందనం సమర్పించారు. విద్యార్థులు బైరెడ్డిపల్లెలో ర్యాలీ చేశారు. బైరెడ్డిపల్లె ఇండియన్ ఆటో స్టాండ్ వద్ద భారతదేశ చిత్రపటంతో అలంకరించారు.

• పెద్దపంజాణి: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కార్యాలయాల్లో స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జాతీయ నాయకుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో కార్యాలయం, పెద్దపంజాణి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సుష్మకీర్తి, వైస్ ఎంపీపీ జీడీ బాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బాగారెడ్డి పాల్గొన్నారు.

• రొంపిచెర్ల: రొంపిచెర్ల మండలంలో సాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. తహసీల్దార్ అమరనాథ్, ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి, ఏఎస్ఐ రమణ్‌రావ్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రెడ్డి ప్రదీప్, కేజీబీవీ ప్రత్యేక అధికారి సుజాత, పీహెచ్‌సీ వైద్యాధికారి వినయ్, సర్పంచులు చిచ్చిలి అరుణమ్మ, ఇబ్రహీంఖాన్, సుధారాణి, జీవలత, వేమలత జాతీయ జెండాలు ఎగుర వేశారు.

• సదుం: మండలంలో స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. సదుం సీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్ ప్రసాదరాజు జెండా ఎగుర వేశారు. పలువురి సిబ్బందికి ఉత్తమ సేవా ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మాధవి జెండా ఎగురవేశారు.

• వి.కోట: స్థానిక ఎంపీడీవో, వెలుగు కార్యాలయాల్లో ఎంపీపీ యువరాజు, పోలీసు స్టేషన్‌లో సీఐ సోమశేఖర్‌రెడ్డి, వి.కోట ప్రధాన సచివాలయంలో సర్పంచ్ పీఎన్ లక్ష్మీ జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం సమర్పించారు. వైస్ ఎంపీపీ తమీమ్‌ఖాన్, ఎంపీడీవో ఈశ్వరన్, ఎంఈవోలు చంద్రశేఖర్, మురుగేష్, ఎంపీటీసీ చలపతి తదితరులు పాల్గొన్నారు.

• గంగవరం: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన నాయకులను స్మరించుకున్నారు. కలగటూరు సచివాలయ పరిధిలో పనిచేస్తున్న ఆశావర్కర్ సుమిత్ర ఉత్తమ అవార్డు, ప్రశంసా పత్రం అందుకున్నారు.

• గుడుపల్లె: మండలంలో శుక్రవారం స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో ఎంపీడీవో రాధాకృష్ణ, తహసీల్దార్ శాంతారాం, పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ శ్రీనివాసులు జాతీయ జెండా ఎగురవేశారు. పీఈఎస్ మెడికల్ కళాశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

• కుప్పం/కుప్పం రూరల్: మండలంలో స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ భరత్ పార్టీ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. కుప్పం ఆర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) కార్యాలయం వద్ద పీడీ వికాస్ మర్మతు, ఆర్డీవో శ్రీనివాసులురాజు, ఎమ్మెల్సీ కంచర శ్రీకాంత్ జెండా ఎగరవేశారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ అశ్వని, మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్ స్వాతంత్ర వేడుకలు నిర్వహించారు. కుప్పం ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ బీసీ నాగరాజు కళాశాల ఆవరణలో జెండాను ఎగురవేశారు.

• చౌడేపల్లె: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి , బోయకొండలో ఈవో ఏకాంబరం, ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో మండల స్థాయి అధికారులు, సచివాలయాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు జెండా ఎగురవేశారు. ఎంపీడీవో లీలామాధవి, ఎంఈవో కేశవరెడ్డి స్వాతంత్య్రం కోసం ప్రాణాలు త్యాగం చేసిన నాయకుల సేవలను స్మరించారు.

• పుంగనూరు: కోర్టు ఆవరణలో జడ్జి ఆరిఫాషేక్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఆకుల చెన్నకేశవులు, మున్సిపాలిటీలో కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, చైర్మన్ అలీమ్‌బాషా జాతీయ జెండాను ఎగురవేశారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, రహమత్‌నగర్‌లో వైఎస్సార్ సీపీ సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్‌షరీఫ్ జెండా ఆవిష్కరణ చేశారు. శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు ఉప్పుతో స్వాతంత్య్ర దినోత్సవానికి సంబంధించిన బొమ్మలు వేశారు. పోలీస్ స్టేషన్‌లో సీఐ సుబ్బరాయుడు పతాకావిష్కరణ చేశారు.

• శాంతిపురం: మండల సచివాలయం వద్ద జెడ్పీటీసీ శ్రీనివాసులు, ఎంపీడీవో ఏపీఆర్ కుమార్, తహసీల్దార్ శివయ్య జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పీఏసీఎస్ వద్ద చైర్మన్ గోపాల్, రాళ్లబూదుగూరు పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ నరేష్, అబకలదొడ్డి ప్రభుత్వ ఐటీఐలో ప్రిన్సిపాల్ శేషారెడ్డి జెండాను ఎగురవేశారు.

• పలమనేరు: పలమనేరులో స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు జాతీయజెండా ఎగురవేశారు. పలమనేరు ఆస్పత్రిలో ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి, ఎంపీ ప్రసాద్‌రావు, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ హేమంత్‌కుమాత్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి, మండీసుధా, సబ్‌కోర్టు వద్ద సీనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ, జూనియర్ సివిల్ జడ్జి లలిత జాతీయ జెండా ఎగురవేసి వందనం సమర్పించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంచి మార్కులను సాధించిన విద్యార్థులకు మలిశెట్టి సీతారాం పేరిట బహుమతులు అందజేశారు.


పలమనేరు: దిగువ కల్లాడులో సాంస్కృతిక కార్యక్రమాలు


పలమనేరు: జెండా వందనం చేస్తున్న నాయకులు


పెద్దపంజాణి: జెండాకు వందనం చేస్తున్న తహసీల్దార్


వి.కోట: జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ యువరాజు


పుంగనూరు: గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు


చౌడేపల్లె ఎంపీడీవో కార్యాలయంలో జెండా ఆవిష్కరణ


గుడుపల్లె: బహుమతులు అందజేస్తున్న వక్తలు


రొంపిచెర్ల పీహెచ్‌సీలో జెండా ఎగుర వేస్తున్న డాక్టర్ వినయ్

ఎన్నికలకు కూటమి కొత్త నిర్వచనం

పలమనేరు: పులివెందుల, ఒంటిమిట్ట ఉప ఎన్నికల్లో కూటమి నేతలు ప్రజాసామ్యాన్ని ఖూని చేశారని పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ విమర్శించారు. ఎన్నికల్లో తమకు ఇష్టం వచ్చినట్టు రిగ్గింగు చేసుకుని కొత్త నిర్వచనం చెప్పారని దుయ్యబట్టారు. కనీసం అభ్యర్థి కూడా ఓటు వేయకుండా, వైఎస్సార్ సీపీ ఏజెంట్లు లేకుండా ఎక్కడైనా ఎన్నికలు జరిగాయా అని ప్రశ్నించారు. అక్కడి ఎన్నికల్లో జరిగిన దారుణాన్ని చూసిన రాష్ట్ర ప్రజానీకం కూటమి పాలన ఎంత గొప్పగా ఉందో బాగా అర్థం చేసుకున్నారని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం, పోలీసులు, అధికారులు ఒక్కటై


పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

ఏమైనా చేయవచ్చని రాబోవు తరాలకు చంద్రబాబు తెలియజేశారని తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

నేడు గోపూజ

కాణిపాకం: శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకుని కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో శనివారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు గోపూజ నిర్వహిస్తున్నట్లు ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ఇందులో భాగంగా గోవులకు ప్రత్యేక పూజలు చేస్తామన్నారు.

భక్తిప్రపత్తులతో భరణి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం చెంగల్రాయ కొండపై ఉన్న శ్రీ సుబ్రమణ్య స్వామి దేవస్థానంలో శనివారం భరణిని భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. మూలస్థానంలోని స్వామి వారిని విశేషంగా అలంకరించారు. భక్తులు కావళ్లతో వచ్చి మొక్కులు చెల్లించారు. పలువురు భక్తులు కావళ్లతో తమిళనాడు రాష్ట్రం వళ్లిమలై, తిరుత్తణిలోని సుబ్రమణ్యస్వామి సన్నిధికి బయలుదేరారు. అలాగే చిత్తూరు మండలం చెర్లోపల్లెలో నెమలికొండలోని శ్రీసుబ్రమణ్యస్వామి దేవస్థానంలో కూడా భరణి పూజలు వైభవంగా జరిగాయి. భక్తులు రాకతో ఆలయాలు హరోం హర నామ స్మరణతో మార్మోగాయి.

ఎంపీ లేకుండానే కార్యక్రమం నిర్వహణ

పలమనేరు: స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఆక్సిజన్ సదుపాయం ఉన్నా పైపులైన్లు లేవని సాక్షి దినపత్రికలో కథనం రావడంతో స్పందించిన జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు చేయించారు. బెడ్లకు ఆక్సిజన్ సౌకర్యాన్ని ప్రారంభించే కార్యక్రమం శుక్ర వారం చేపట్టారు. ఎంపీ దుగ్గిమెళ్ల ప్రసాద్ రాకుండానే ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ప్రారంభించేశారు. ఆ తర్వా త ఎంపీ వచ్చారు. లోపలే మదనపడిన ఎంపీ ఏమీ మాట్లాడలేక కార్యక్రమంలో పాలు పంచుకోవాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యం లేదనందుకు ఈ సంఘటనే నిదర్శనమని ఆయా సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అన్నదానానికి రూ.10 వేల విరాళం

పుంగనూరు: పట్టణంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో అయ్యప్ప మాలధరించిన భక్తులకు అన్నదానం నిర్వహించేందుకు శుక్రవారం పుంగనూరుకు చెందిన వరదారెడ్డి రూ.10 వేలు విరాళంగా అందజేశారు. సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని అయ్యప్ప భక్తులకు తోడ్పాటు ఇవ్వాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ఆంజనేయ స్వామికి ఇరుముడి చెల్లింపు


గాండ్లపల్లెలో ఇరుముడి చెల్లిస్తున్న భక్తులు

చౌడేపల్లె: ఆంజనేయస్వామి మాల ధరించి 41 రోజులు దీక్ష చేపట్టిన మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ గాండ్లపల్లెకు చెందిన భక్తులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఇరుముడి చెల్లించారు. అర్చకులు ఆనందాచార్యుల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, గణపతి, నవగ్రహ, శాంతి హోమాలు నిర్వహించారు.

కనుల పండువలా షణ్ముఖస్వామి కల్యాణం


పుంగనూరులో భరణి కావళ్లను ఊరేగింపుగా తీసుకెళుతున్న భక్తులు

చౌడేపల్లె: స్థానిక బజారువీధిలో వున్న అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీవళ్లీ దేవసేన సమేత షణ్ముఖ సుబ్రమణ్యస్వామి వారి కల్యాణాన్ని కనుల పండువలా నిర్వహించారు. ప్రధాన అర్చకులు రాజశేఖర దీక్షితులు, మహేష్ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు.

భరణి కావళ్ల చెల్లింపు

పలువురు భక్తులు స్వామి వారికి భరణి కావళ్ల సమర్పించారు. కొందరు నాలుక, నోటిలో త్రిశూలం గుచ్చుకుని మొక్కులు చెల్లించారు.


చౌడేపల్లె: విశేషాలంకరణలో స్వామి వారు

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణానికి చెందిన పలువురు సుబ్రమణ్యస్వామి భక్తులు శుక్రవారం భరణి కావళ్లు తీసుకుని ఊరేగింపుగా తమిళనాడులోని తిరుత్తణి సుబ్రమణ్య స్వామికి సమర్పించడానికి తరలివెళ్లారు.

ఘనంగా ఊంజల్ సేవ

గుడుపల్లె: గుడివంక శ్రీవళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో శనివారం నుంచి ఆడికృత్తిక వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. వారం రోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం భక్తులు పెద్ద ఎత్తున కావళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం సుబ్రమణ్యస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఊంజల్ సేవ చేపట్టారు.

ప్రత్యేక బస్సులు

ఆడికృత్తిక వేడుకలు మొదలుకానున్న నేపథ్యంలో గుడివంక ఆలయానికి కుప్పం నుంచి 20 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు అధికారులు తెలిపారు. కర్ణాటకలోని కేజీఎఫ్, కామసముద్రం నుంచి కూడా బస్సులు నడపనున్నట్టు పేర్కొన్నారు. రద్దీతో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.


విశేషాలంకరణలో శ్రీవళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి



శ్రీవళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయం వద్ద భక్తుల సందడి, కావళ్లతో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

మొక్కుబడిగా గ్రామసభలు

చౌడేపల్లె: మండలంలోని గ్రామసచివాలయాల్లో శుక్రవారం తూతూమంత్రంగా గ్రామసభలు నిర్వహించారు. అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించి సచివాలయ సిబ్బందితో కలిసి ఫొటోలు తీసుకొని వెళ్లిపోయారు. మండల స్థాయి అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతోనే సిబ్బంది ఇలా వ్యవహరిస్తూ గ్రామాల అభివృద్ధిలో చొరవ తీసుకోవడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిరంతరం వెలుగులే



బైరెడ్డిపల్లె బీసీ కాలనీలో పగలే వెలుగుతున్న వీధి దీపం, బైరెడ్డిపల్లె షాదీమహల్ రోడ్డులో..

బైరెడ్డిపల్లె: గ్రామాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. వాటికి స్విచ్‌లు లేకపోవడంతోనే రాత్రి పగలు వెలుగుతూనే ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు విద్యుత్‌ను ఆదా చేయాలని చెబుతూ ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైంది కాదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి దీపాలకు స్విచ్‌లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.